క్లుప్తంగా

అధికారులతో ఆర్డీఓ సమీక్ష



పి.గన్నవరం తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఆర్డీఓ శ్రీకర్

పి.గన్నవరం: అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సక్రమంగా అమలు చేయాలని కొత్తపేట ఆర్డీఓ పి.శ్రీకర్ అధికారులను ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని వివిధ శాఖల అధికారులతో మంగళవారం ఆయన సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లో సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. పరిష్కారం కాని సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. తహసీల్దార్ పి.శ్రీపల్లవి, ఎంపీడీఓ కేఎస్ ప్రసాద్, ఎంఈఓ కోన హెలీనా, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ ఏఈలు కె.ఆనంద్, జె.కళ్యాణ చక్రవర్తి, సుందర్‌సింగ్, రాజేంద్ర, ఆర్ఐ పి.నర్సింహరావు, ఏపీఓ మురళీకృష్ణ, ఏపీఎం లక్ష్మీనారాయణ, వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధి నిర్మూలన మనందరి లక్ష్యం



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ దుర్గాకావ్య

సఖినేటిపల్లి: క్షయ వ్యాధి నిర్మూలన మనందరి లక్ష్యమని సఖినేటిపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి సీహెచ్ దుర్గాకావ్య అన్నారు. అప్పనరాముని లంకలో మంగళవారం సర్పంచ్ ఇందుకూరి సుబ్బరాజు అధ్యక్షతన జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమంలో క్షయ వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో డాక్టర్ మాట్లాడుతూ, రెండు వారాలకు పైబడి దగ్గు, కళ్లె పడడం, రాత్రి వేళల్లో జ్వరం రావడం, ఛాతీలో నొప్పి రావడం వంటి లక్షణాలు ఉన్నవారు పీహెచ్‌సీలో కచ్చితంగా వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలన్నారు. వ్యాధికి డాట్ పద్ధతిలోనే ఇంటి వద్ద రోగులకు సిబ్బంది ఉచితంగా చికిత్స అందజేస్తారన్నారు. ఆశా కార్యకర్తలు ఇంటింటి సర్వే చేసి గుర్తించిన వారి నుంచి కఫం సేకరించి పరీక్షలకై ల్యాబ్‌కు పంపినట్టు ఆమె తెలిపారు. వీఎస్ఎన్ మూర్తి, పీఎల్ఎన్ స్వామి, ఎ.సరస్వతి, ఎన్.మమత, ఎం.బాలశంకర్, ఎ.కరుణ కుమార్, రాజోలు టీబీ యూనిట్ అధికారులు పాల్గొన్నారు.

టీటీడీ కల్యాణ మంటపాన్ని అభివృద్ధి చేస్తాం



మామిడికుదురులో కల్యాణ మంటపాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వరప్రసాద్

మామిడికుదురు: టీటీడీ కల్యాణం మండపం నిరుపయోగంగా మారిందని దానికి పూర్వ వైభవం తీసుకువచ్చే దిశగా చర్యలు తీసుకుంటానని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ తెలిపారు. ఆయన మంగళవారం కల్యాణం మండపాన్ని పరిశీలించారు. స్థలదాత వారసుడు యాలి శ్రీనివాస్ కల్యాణం మండపంలో నెలకొన్న సమస్యలను వివరించారు. మంటపం పైభాగంలో ఏర్పాటు చేసిన సీలింగ్ పాడైపోయిందని చెప్పారు. దాంతో కల్యాణం మంటపంలో వివాహాలను నిలిపి వేశారన్నారు. ఈ-దర్శనం కౌంటర్‌ను రద్దు చేశారని తెలిపారు. గాల్వా వ్యాల్యూమ్ రేకులు వేశారని దాని స్థానే శ్లాబ్ వేయించాలని, కల్యాణ మంటపం ఆవరణను లెవెలింగ్ చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. వీటిపై టీటీడీ అధికారులతో మాట్లాడి కల్యాణ మంటపాన్ని ఆధునీకరిస్తామన్నారు. మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెదకాపు, స్థానిక నాయకులు ఆయన వెంట ఉన్నారు.

పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ



పీహెచ్‌సీ రికార్డులను పరిశీలిస్తున్న ఏడీఎంఅండ్‌హెచ్ఓ భారతీలక్ష్మి

అయినవిల్లి: మండలంలోని వీరవల్లిపాలెం పీహెచ్‌సీని అడిషనల్ డీఎంఅండ్‌హెచ్ఓ వి.భారతీలక్ష్మి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సక్రమంగా వైద్యసేవలు అందుతున్నాయా లేదా అనే విషయంపై రోగులను ఆమె ఆరా తీశారు. అనంతరం పీహెచ్‌సీకి చెందిన సిబ్బంది మూమెంట్ రిజిష్టర్, సిబ్బంది ఫిర్యాదులకు చెందిన రికార్డులను ఆమె పరిశీలించారు. ఆస్పత్రి పరిసరాలను ఆమె పరిశీలించారు. పీహెచ్‌సీ వైద్యులు లక్ష్మీసౌజన్య, టి.విజయ్‌లతో పాటు ఆమె పీహెచ్‌సీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. సీజనల్ వ్యాధులపై సిబ్బంది అప్రమత్తం అవ్వాలని, ఎప్పటికప్పుడు ప్రజలకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు.

నిలిచిన అంతర్వేది రోడ్డు పనులు

- అసంపూర్తి పనులతో ప్రమాదాలు
- సెంట్రల్ రోడ్స్ ఫండ్స్ నుంచి రూ.25 కోట్లు మంజూరు
- పది కిలోమీటర్ల పొడవునా రెండు లేన్లుగా ప్రతిపాదన



మోరి వంతెన సమీపాన అత్యంత ప్రమాదకరంగా ఉన్న అంతర్వేది రోడ్డు



కేశవదాసుపాలెంలో ఒక ఉపాధ్యాయిని మృతి చెందిన తరువాత పూడ్చిన రోడ్డు గొయ్యి

మలికిపురం: ప్రముఖ పుణ్యక్షేత్రం అంతర్వేదికి రవాణా మార్గాలను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయాలని గత వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. ఇందులో బాగంగా అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సెంట్రల్ రోడ్స్ ఫండ్స్ నుంచి రూ.25 కోట్లు కేటాయించారు. దీంతో అప్పట్లో రోడ్ల పనులు చురుకుగా జరిగాయి. గత ఆరు నెలలుగా రోడ్డు పనులు ఎక్కడి వేసిన గొంగళి అక్కడే అన్న చందాన మారాయి. అంతర్వేది వెళ్లే ప్రధాన ఆర్‌అండ్‌బీ రోడ్డు గత కొన్నేళ్లుగా అత్యంత ఇరుకుగా ఉంది. గత పాలకులు పూర్తిగా వదిలేయడంతో సాధారణ ప్రజానీకంతో పాటు అంతర్వేది తీర్థ మహోత్సవాల సమయంలో భారీ వాహనాల రాకపోకలకు తీవ్ర అవాంతరాలు ఏర్పడి భక్తులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే ఓఎన్జీసీ కార్యకలాపాలు కూడా ఇక్కడ అధికంగా ఉంటాయి. దీంతో భారీ వాహనాల తాకిడి ఇక్కడ అధికం. సుమారు 200 ఏళ్ల పైబడి నుంచి ఇక్కడ అంతర్వేది ఉత్సవాలకు రానురానూ భక్తుల రద్దీ అధికమైంది. అలాగే సుమారు 40 ఏళ్ల నుంచి ఇక్కడ ఆయిల్ నిక్షేపాల వెలికితీత అధికంగా ఉంది. అయితే రోడ్ల వెడల్పు మాత్రం మరిచారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఈ సమస్యపై ప్రధానంగా దృష్టి పెట్టింది. అంతర్వేది నుంచి వయా కేశవదాసుపాలెం మీదుగా టేకిశెట్టిపాలెం వరకూ ఉన్న ప్రధాన ఆర్‌అండ్‌బీ రోడ్డును ఏడుమీటర్లకు వెడల్పు చేసి అభివృద్ధి చేయడానికి సెంట్రల్ రోడ్స్ ఫండ్ నుంచి రూ.25 కోట్ల మంజూరు చేయించింది. మొత్తం 13.4 మీటర్ల రోడ్డులో పది కిలోమీటర్ల రోడ్డు ఏడు మీటర్లకు వెడల్పు చేసి, రెండు లేన్లుగా అభివృద్ధి చేయాలి. మోరి జీసీఎస్ సమీపం నుంచి కేశవదాసుపాలెంలోని కాలువ మొగ మీదుగా అంతర్వేది ఆలయ ప్రాంతం వరకూ అభివృద్ధి జరుగుతుంది. రోడ్డు వెడల్పు పనుల్లో భాగంగా రోడ్డుకు చేర్చి ఉన్న అంతర్వేది ప్రధాన పంటకాలువకు రిటైనింగ్ వాల్ నిర్మాణం పూర్తి చేయాల్సి ఉండగా రాంబాగ్ నుంచి పనులు జరగ లేదు. మోరి జీసీఎస్ నుంచి కాలువ మొగ వరకూ సుమారు 800 మీటర్ల మేర రిటైనింగ్ వాల్ నిర్మాణం పూర్తయింది. కేశవదాసుపాలెం కాలువ మొగ నుంచి అంతర్వేది రోడ్డులో కొంతవరకూ పంట కాలువకు గతంలోనే రిటైనింగ్ వాల్ నిర్మాణం పూర్తి చేశారు.

ప్రాణాలు తీస్తున్న అసంపూర్తి పనులు

అంతర్వేది రోడ్డు పనులు అసంపూర్తిగా ఉండడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. గత నెలల కేశవదాసుపాలెంలో రోడ్డు గుంతలో పడి ఒక ఉపాధ్యాయిని మృతి చెందారు. అలాగే అంతర్వేది-కేశవదాసుపాలెం మధ్య రోడ్డులో ఇద్దరు వ్యక్తులు వేర్వేరు ప్రమాదాలకు గురై ఒక వ్యక్తి చనిపోయాడు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. రోడ్డులో ఆక్రమణలు పూర్తి స్థాయిలో తొలగించక, విద్యుత్ లైన్లు సరి చేయక, రోడ్డు అసంపూర్తిగా గోతుల మయంగా ఉండడం వల్ల ఈ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఇక ప్రతిపాదనలో లేని టేకిశెట్టిపాలెం-కేశవదాసుపాలెం ఓఎన్జీసీ జీసీఎస్ వరకూ సుమారు నాలుగు కిలోమీటర్ల రోడ్డులో అనేక ప్రమాదకర మలుపులు ఉన్నాయి. ఇక్కడ రోడ్డు నాలుగు మీటర్ల వెడల్పు కూడా లేదు. ఈ రోడ్డు కూడా అభివృద్ధి చేయాలి. కనీస ప్రతిపాదనలు కూడా లేవు.

ఆరు నెలల్లో పనులు పూర్తి కావాలి

2023లో ప్రారంభమైన పనులు ఆరు నెలల్లో రోడ్డు పనులు పూర్తయ్యేలా ఆర్‌అండ్‌బీ ప్రణాళికలను రూపొందించింది. 2024 ఫిబ్రవరిలో అంతర్వేది ఉత్సవాలు నాటికి పూర్తి కావాల్సి ఉంది. కానీ కేంద్రం నుంచి నిధులు విడుదల జాప్యం కారణంగా ప్రస్తుత కూటమి ప్రభుత్వం శ్రద్ధ చేయక పనులు పూర్తి కాలేదు. 2025 ఉత్సవాల నాటికైనా పూర్తి చేస్తారో లేదోననే అనుమానాలు ఉన్నాయి.

ఉన్నతాధికారులతో మాట్లాడతాం



రోడ్డు పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు ఉన్నతాధికారులతో మాట్లాతాం. ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటాం. జరుగుతున్న ప్రమాదాలను గుర్తించాం. ఇప్పటికే పలు చోట్ల రక్షణ చర్యలు తీసుకుంటున్నాం.

– ఎ.రవి, డీఈ, ఆర్‌అండ్‌బీ, రాజోలు

తీర ప్రాంత అభివృద్ధికి కీలకం



మాజీ సీఎం జగన్ చలవతో సెంట్రల్ రోడ్స్ ఫండ్స్ నుంచి రూ.25 కోట్లు మంజూరైనా అంతర్వేది రోడ్డు పనులు నిలిచిపోవడం విచారకరం. సముద్రతీర ప్రాంతాల అభివృద్ధిలో ఈ రోడ్డు కీలకం కానుంది. అంతర్వేది రద్దీతో పాటు, వ్యవసాయ, వాణిజ్య, ఆయిల్ నిక్షేపాల రవాణాకు మార్గం విశాలంగా ఉంటుంది. అసంపూర్తి పనుల వల్ల ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారు.

– గొల్లపల్లి సూర్యారావు, మాజీ మంత్రి, రాజోలు

అందరి సహకారంతో పీహెచ్‌సీ ఏర్పాటు



పుల్లేటికుర్రులో బీసీ హాస్టల్‌ను పరిశీలించి వివరాలు తెలుసుకుంటున్న డీఎంఅండ్‌హెచ్‌వో దుర్గారావుదొర

అంబాజీపేట: రెండు గ్రామాల్లో ఉన్న ప్రజాప్రతినిధులు, గ్రామస్తుల సహకారంతో పుల్లేటికుర్రులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ) ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని జిల్లా డీఎం అండ్‌హెచ్‌వో ఎం.దుర్గారావుదొర అన్నారు. స్థానిక మార్కెట్ పాలెం వద్ద నిరుపయోగంగా ఉన్న బీసీ హాస్టల్‌ను వైద్యాధికారి ఎ.ఇంద్రావతి ఆధ్వర్యంలో మంగళవారం ఆయన పరిశీలించారు. డీఎంఅండ్‌హెచ్‌వో మాట్లాడుతూ ముక్కామలలో పీహెచ్‌సీ ఇరుకు గదుల్లో కొనసాగుతుందని దానిని స్థానికంగా ఖాళీగా ఉన్న బీసీ హాస్టల్ వసతి గృహంలోకి మార్పు చేయాలంటూ సర్పంచ్ జల్లి బాలరాజు మంగళగిరిలోని డైరెక్టర్ ఆఫ్ హెల్త్‌కు లేఖ ద్వారా తెలియపరిచారన్నారు. దాంతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బీసీ హాస్టల్‌ను పరిశీలించామన్నారు. ముక్కామల పీహెచ్‌సీని మార్పు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. హాస్టల్‌లో అన్ని రోగులకు అవసరమైన గదులతో పాటు వైద్య సిబ్బందికి కావాల్సిన సౌకర్యాలు ఉన్నాయని సర్పంచ్ బాలరాజు డీఎంఅండ్‌హెచ్‌వోకు వివరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు వడలి కృష్ణమూర్తి, కుసుమ వెంకటేష్, పబ్బినీడి రాంబాబు, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీపతి, సీహెచ్ఓ ఎం.రవి కుమార్, హెల్త్ సూపర్‌వైజర్ ఎ.రాధానరసింహం, మాజీ సర్పంచ్‌లు పాల్గొన్నారు.

మా సొమ్ములు ఇప్పించండి

ద్వాక్రా గ్రూపు సభ్యులు నిరసన



పుల్లేటికుర్రు పంచాయతీ వద్ద నిరసన తెలుపుతున్న ద్వాక్రా మహిళలు

అంబాజీపేట: బ్యాంకు అధీకృత కస్టమర్ పాయింట్ నిర్వాహకురాలు, బ్యాంకు అధికారులు స్వాహా చేసిన ద్వాక్రా గ్రూపు సభ్యుల సొమ్ములను తక్షణమే మాకు ఇప్పించాలంటూ ద్వాక్రా మహిళలు డిమాండ్ చేశారు. పుల్లేటికుర్రు పంచాయతీ కార్యాలయం వద్ద ద్వాక్రా మహిళలు తమకు న్యాయం చేసి, డబ్బులు ఇప్పించాలంటూ మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. పుల్లేటికుర్రు యూనియన్ బ్యాంక్‌లో కస్టమర్ పాయింట్ నెలకొల్పేందుకు ఇంటిగ్రా కంపెనీకి అధికారికంగా అనుమతి ఇచ్చింది. ఈ కస్టమర్ పాయింట్‌లో బ్యాంకు పరిధిలో ఉన్న తొమ్మిది ద్వాక్రా గ్రూపు సంఘ సభ్యులు తాము తీసుకున్న ఋణమొత్తాల వాయిదాలను ప్రతినెలా నిర్వాహకురాలు పరమట మణికి చెల్లించారని బీసీ పాయింట్ బ్యాంక్ మిత్ర కోఆర్డినేటర్ ఎల్.నరేష్, ఏరియా మేనేజర్ కె.రఘుచరణ్‌లు తెలిపారు. అయితే ఈ నిర్వాహకురాలు వాయిదాలను బ్యాంకుకు సక్రమంగా చెల్లించకపోవడంతో రూ.18 లక్షలు స్వాహా అయినట్లు గుర్తించామన్నారు. దీనిలో భాగంగానే కస్టమర్ పాయింట్ నిర్వాహకురాలు మణి బ్యాంక్ అకౌంట్‌లో రూ.7 లక్షలు ఉన్నాయని వాటిని బ్లాక్ చేయించామన్నారు. మిగిలిన రూ.11 లక్షలు రికవరీ చేసేందుకు సర్పంచ్‌లు జల్లి బాలరాజు, సరస్వతుల సుబ్రహ్మణ్య ప్రసాద్, ఎంపీటీసీ వడలి కృష్ణమూర్తి, ద్వాక్రా సభ్యుల సహకారంతో అంబాజీపేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేస్తామన్నారు. ఇదిలా ఉండగా ఆంధ్రా బ్యాంకు అధికారులు, ఇంటిగ్రా కంపెనీ వారిపై కేసులు పెట్టాలని ద్వాక్రా మహిళలు హెచ్చరించారు. తక్షణమే మాకు న్యాయం చేయాలని నినాదించారు. అనంతరం బ్యాంకు వద్ద ద్వాక్రా మహిళలు నిరసన వ్యక్తం చేశారు.

సమాచార హక్కు చట్టంపై రైతులకు అవగాహన



కొత్తపేటలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ పద్మలత

కొత్తపేట: పొల్లం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం కొత్తపేటలో జరిగిన సమావేశంలో సమాచార హక్కు చట్టంపై రైతులకు అవగాహన కల్పించారు. సర్పంచ్ బూసి జయలక్ష్మి అధ్యక్షతన జరిగిన సమావేశంలో మండల వ్యవసాయ అధికారి (ఏఓ) పి.పద్మలత మాట్లాడుతూ ప్రతి అధికార యంత్రాంగంలో పారదర్శకత, జవాబుదారీతనం తీసుకురావడం కోసం అధికార యంత్రాంగాల అదుపులో ఉన్న సమాచారాన్ని ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు కేంద్ర, రాష్ట్రాల్లో సమాచార కమిషన్‌ను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వాలు చర్యలు తీసుకున్నాయన్నారు. ప్రస్తుతం తుపాను, వర్షాలతో కూడిన వాతావరణం నేపథ్యంలో పంటలను ముఖ్యంగా ఖరీఫ్ వరి పంటను తరచూ గమనిస్తూ తెగుళ్లు ఏమైనా ఆశిస్తే వ్యవసాయ శాఖ దృష్టికి తీసుకురావడం ద్వారా తెగుళ్ల నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో వీఏఏలు కార్తిక్, బి.లలిత, వీహెచ్ఏ పి.నీలిమ, రైతులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలి



రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ఫేర్‌వెల్ డే లో మాట్లాడుతున్న సీఐ

రాజోలు: విద్యార్థి దశలో విద్యార్థులు జీవితంలో ఉన్నత లక్ష్యాలకు దిశ దశ నిర్దేశం చేసుకునేలా నిర్దేశించుకోవాలని రాజోలు సీఐ టీవీ నరేష్‌కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ చదువును పూర్తి చేసి బయటకు వెళుతున్న ఫైనల్ ఇయర్ విద్యార్థులకు వీడ్కోలు సభ ఇతర డిగ్రీ బ్యాచ్‌ల విద్యార్థులు ఏర్పాటు చేశారు. ఈ సభకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సాయిబాబు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన సీఐ మాట్లాడుతూ, క్రమశిక్షణతో ఉంటూ జీవితంలో ఎటువంటి అసాంఘిక కార్యకలాపాల్లో పాల్గొనకుండా జాగ్రత్తలు తీసుకోవాలని హితవు పలికారు. అలాగే అతి వేగంతో కూడిన డ్రైవింగ్ చేయవద్దని, చక్కని విలువలుతో ఉన్నత స్థితికి చేరాలని సీఐ సూచించారు. వైస్ ప్రిన్సిపాల్ పద్మనాభం, జొన్నలగడ్డ గోపాలకృష్ణ, డాక్టర్ పీపీ బోస్, కళాశాల పీఆర్వో ఎన్ రాజు, డబ్ల్యూఈసీ కో ఆర్డినేటర్ శైలజ, అశ్వినీరెడ్డి, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

రాపాక వ్యాఖ్యలు అర్ధరహితం



పాటి శివకుమార్

మలికిపురం: వైఎస్సార్ సీపీపై రాజోలు మాజీ ఎమ్మెల్యే రాపాక వర ప్రసాదరావు చేస్తున్న వ్యాఖ్యలు అర్ధ రహితమని నెడ్ క్యాప్ మాజీ డైరెక్టర్, పార్టీ రాష్ట్ర యూత్ విభాగం నాయకులు పాటి శివకుమార్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన మలికిపురం పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ మాజీ సీఎం జగన్ మాజీ ఎమ్మెల్యే రాపాక వర ప్రసాదరావుకు ఎనలేని గౌరవం ప్రాధాన్యం ఇచ్చారని, ఆయన గతం లోకి వెళ్లి ఒక సారి పునరాలోచన చేసుకోవాలని సూచించారు. పార్టీ మారాలనుకుంటే తమ నాయకుడు జగన్‌పై నిందలేసి వెళ్లాల్సిన అవసరం రాపాకకు లేదన్నారు. రాజోలు నియోజకవర్గంలో ఇప్పటి వరకూ కొందరు నాయకుల నిలకడ లేని తనం వల్ల పార్టీ నష్టపోయింది కాని, కార్యకర్తలు బలంగా ఉన్నారని ఆయన అన్నారు. రాపాక వెంట వెళ్లే కార్యకర్తలు రాజోలు వైఎస్సార్ సీపీలో లేరని, తమ నేత జగన్ మాటను శిరసావహించే కార్యకర్తలే నియోజకవర్గంలో ఉన్నారని ఆయన స్పష్టం చేశారు.

డిసెంబర్‌లో తూర్పుపాలెం వంతెన ప్రారంభం

మలికిపురం: మండలంలోని శంకరగుప్తం మేజర్ డ్రైన్‌పై నిరుపయోగంగా ఉన్న తూర్పుపాలెం వంతెనను ఎవరు సహకరించినా సహకరించకపోయినా వచ్చే డిసెంబరు నెలలో ప్రారంభిస్తానని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ స్పష్టం చేశారు. గత శుక్రవారం 'సాక్షి'లో ప్రచురితమైన ఈ వంతెన కథనంపై ఎమ్మెల్యే మరోసారి స్పందించారు. కేశనపల్లి సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే దేవను పల్లిపాలెం-తూర్పుపాలెం గ్రామాల నాయకులు అభివృద్ధి పనులు అడుగుతుండగా ఆయన మాట్లాడుతూ అసలు తూర్పుపాలెం వంతెనను ఇంత కాలంగా ఎందుకు వినియోగంలోకి తీసుక రాలేదని ప్రశ్నించారు. రూ.4.5 కోట్లతో నిర్మించిన ఈ వంతెనను ఎనిమిదేళ్లుగా అలంకార ప్రాయంగా ఉంచుతారా అని ప్రశ్నించారు. సమస్యల పరిష్కారానికి సహకరించండి లేకుంటే డిసెంబర్ నెల నాటికే అన్ని పనులు పూర్తి చేసి వంతెన ప్రారంభించడం ఖాయమన్నారు.

రాత్రివేళల్లో ఇసుక తరలింపు

అయినవిల్లి: శానిపల్లిలంక, కొండుకుదురు గ్రామాల నుంచి రాత్రి వేళల్లో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారంటూ ఆ గ్రామాల వీఆర్వోలు మంగళవారం తహశీల్దార్ కార్యాలయం, స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఏ విధమైన అనుమతులు లేకుండా రాత్రి సమయంలో ఇసుకను తరలిస్తున్నట్లు తాము గుర్తించామన్నారు. అలా చేస్తున్న వారిని నిలదీయగా తమపై తిరగబడుతున్నారని తెలిపారు. శానపల్లిలంకలో రైల్వే నిర్మాణ పనుల కోసం ఏర్పాటు చేసిన ఇసుక నిల్వలను, కొండుకుదురులో గోదానది నుంచి ఇసుకను తోడి విక్రయిస్తున్నారన్నారు. దీనిపై తహసీల్దార్ సీహెచ్ నాగలక్ష్మమ్మను వివరణ కోరగా ఇసుక తరలించకుండా రీచ్‌ల వద్ద గ్రామ రెవెన్యూ అధికారులతో గస్తీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

గోదావరిలో మునిగి బాలుడి మృతి

ఆత్రేయపురం: నార్కెడ్‌మిల్లి గ్రామానికి చెందిన పిల్లి అభిషేక్ (13) ఆదివారం గోదావరిలో మునిగి మృతి చెందాడు. స్థానికుల వివరాల ప్రకారం.. అభిషేక్ ఆదివారం సాయంత్రం గోదావరికి వెళ్లాడు. అక్కడ కాలు జారి నదిలో గల్లంతయ్యాడు. పశ్చిమగోదావరి జిల్లా తీపర్రు వద్ద మంగళవారం మృతదేహం లభ్యమైంది. బాలుడు తల్లి లక్ష్మి దుబాయ్‌లో ఉంటున్నారు. సమాచారం తెలుసుకుని ఆమె మంగళవారం స్వగ్రామానికి వచ్చారు. దీనిపై ఇంకా ఎలాంటి కేసు నమోదు కాలేదని ఎస్సై రాము తెలిపారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి



పెనికేరు పంచాయతీ కార్యాలయం వద్ద అంటువ్యాధుల వ్యాప్తిపై వివరాలు సేకరిస్తున్న డీఎల్‌పీఓ రాజు

ఆలమూరు: వాతావరణ పరిస్థితుల ప్రభావం దృష్ట్యా గ్రామ పంచాయతీ సిబ్బంది సహకారంతో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని కొత్తపేట డీఎల్‌పీఓ ఎ.రాజు అన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో మంగళవారం ఆయన పర్యటించి పలు వాటర్ ట్యాంకుల నిర్వహణ, పారిశుధ్య పనులను ఆయన పరిశీలించి తీసుకోవలసిన చర్యలను సిబ్బందికి వివరించారు. వాటర్ ట్యాంకు క్లీనింగ్ చేస్తున్న విధానాన్ని ఆరోగ్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు రికార్డులను తనిఖీ చేసి పలు సూచనలు, సలహాలు అందజేశారు. తుపాను ప్రభావం దృష్ట్యా అంటువ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందున పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆయన గ్రామ పంచాయతీ కార్యదర్శులకు తెలియజేశారు. అలాగే పెనికేరులో జరుగుతున్న ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం కార్యక్రమంపై సంతృప్తి వ్యక్తం చేశారు. పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారి పి.భవానీశంకర్, గ్రామ కార్యదర్శులు జె.అయ్యన్న, వి.వేణి, ఎం.విజయారెడ్డి, ఎంపీహెచ్ఏ టి.సుశీల పాల్గొన్నారు.

ఆధార్ సేవలు ప్రారంభం

ఆలమూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు మండలంలోని వివిధ గ్రామాల్లో మంగళవారం ఆధార్ సేవలు ప్రారంభమయ్యాయి. పినపళ్ల, పెనికేరు, మూలస్థాన అగ్రహారం గ్రామాల్లో నిర్వహించిన ఈ-ఆధార్ సేవలను ఆ గ్రామ సర్పంచ్‌లు సంగీత సుభాష్, వనుం చిన్నావతి, లంక వరప్రసాదరావు ప్రారంభించారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో నిర్వహించిన ఈ సేవల్లో పెదపళ్ల, ఆలమూరు, జొన్నాడ గ్రామ సచివాలయాల డిజిటల్ అసిస్టెంట్లు మీసాల నరేష్, వి.దుర్గాప్రసాద్, తేజ తదితరులు ఆధార్ సేవలను అందించారు. ఆయా గ్రామాల్లోని పరిసర ప్రాంతాలకు చెందిన సుమారు 250 మంది తమ ఆధార్ కార్డులను క్రమబద్ధీకరించుకుని చేర్పులు, మార్పులు చేయించుకున్నారు. గ్రామ కార్యదర్శులు ఎస్.వీర్రాజు, జె.అయ్యన్న, సీహెచ్ వీరమాత పాల్గొన్నారు.

మద్యం షాపును మార్చాలంటూ నిరసన



పాశర్లపూడిలో సీఐ వీరబాబుకు సమస్య వివరిస్తున్న మహిళలు

మామిడికుదురు: పాశర్లపూడి బొమ్మిడిపాలెంలో ఏర్పాటు చేసిన మద్యం షాపును వేరే చోటకు మార్పు చేయాలని కోరుతూ స్థానికులు మంగళవారం నిరసన తెలిపారు. నివాస ప్రాంతాల మధ్య ఉన్న ఈ షాపును దూర ప్రాంతానికి తరలించాలని కోరారు. దీనిపై ఇప్పటికే కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. గతంలో ఇదే ప్రాంతంలో మద్యం షాపు ఉండేదని, దీని వల్ల ఎన్నో ఇబ్బందులు పడ్డామన్నారు. గతంలో ఆందోళన చేయడంతో షాపును వేరే ప్రాంతానికి తరలించారని తెలిపారు. ప్రస్తుతం ఉన్న షాపు వల్ల ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నామని వాపోయారు. రాజోలు ఎక్సైజ్ సీఐ వీరబాబు వద్ద నిరసన తెలిపారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి, వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని సీఐ తెలిపారు.

27న జిల్లా స్థాయి చెకుముకి పరీక్ష

మలికిపురం: మలికిపురం డిగ్రీ కళాశాలలో జిల్లా స్థాయి చెకుముకి పరీక్ష ఈనెల 27న జరుగుతుందని నిర్వాహకులు జనవిజ్ఞాన వేదిక మలికిపురం మండల శాఖ అధ్యక్షుడు పీవీవీ వరప్రసాద్ మంగళవారం తెలిపారు. జిల్లాలోని అన్ని మండలాల్లో విజేతలుగా నిలిచిన ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలల టీంలు 27 ఆదివారం ఉదయం 9 గంటలకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆయన సూచించారు.

భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

అంబాజీపేట: రైతుల భూ సమస్యలకు భూ సర్వే శాశ్వత పరిష్కారమని తహసీల్దార్ జె.వెంకటేశ్వరి అన్నారు. వక్కలంక పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ వాసంశెట్టి రేవతి అధ్యక్షతన రెవెన్యూ గ్రామ సభను మంగళవారం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ భూ యజమానులకు శాశ్వత మేలు జరిగేలా నిర్వహిస్తున్న రీ సర్వే గ్రామ సభలను సద్వినియగం చేసుకోవాలన్నారు. పంచాయతీ పరిధిలోని పలు సమస్యలపై లిఖిత పూర్వకంగా గ్రామ సభలో తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. సభలో వీఆర్వో పి.కనకమహాలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

మడికిలో రెవెన్యూ గ్రామ సభలు

ఆలమూరు: మండలంలోని మడికిలో మంగళవారం రెవెన్యూ గ్రామ సభలు జరిగాయి. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ ఉండ్రాసపు లక్ష్మీమౌనిక ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కేజే ప్రకాష్‌బాబు పాల్గొని రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు. రైతుల నుంచి స్వీకరించిన 37 దరఖాస్తులను 15 రోజుల్లో పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. మండల రెవెన్యూ అధికారి ఎం.రామాయమ్మ, మండల సర్వేయర్ ఎం.ప్రభావతి పాల్గొన్నారు.

ఎరువులు అధికంగా వాడవద్దు

అంబాజీపేట: ప్రస్తుత కాలంలో వరి పంటకు ఎరువులు అధికంగా వాడటం వల్ల నష్టాలు వాటిల్లుతాయని మండల వ్యవసాయాధికారి సీహెచ్‌డీ విజయ్‌కుమార్ అన్నారు. పసుపల్లిలో రైతు సేవా కేంద్రాల వద్ద ×పొలం పిలుస్తోంది₹ కార్యక్రమాలు ఏఓ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ ఎరువులు అధికంగా వాడటం వల్ల పురుగులు, తెగుళ్లు ఎక్కువగా వస్తాయన్నారు. నత్రజని ఎరువు తగ్గించి వాడాలని రైతులకు సూచించారు. ఆకు ఎండుతెగులు, సుడిదోమ నివారణకు రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. సుడిదోమ నివారణకు ఇమిడాక్లోప్రిడ్, పైమెట్రిజైన్ దీనిలో ఫ్యూరాన్ అనే మందులో ఏదో ఒక మందు పిచికారీ చేయాలని రైతులకు వివరించారు. కార్యక్రమంలో హెచ్ఈఓ వెంకటేశ్వరరావు, ఏఈఓ డి.దుర్గారావు, వీఏఏలు కె.నరేంద్ర, ఎన్.కిరణ్‌దుర్గ, రైతులు పాల్గొన్నారు.

రెండు వర్గాలపై కేసుల నమోదు

మామిడికుదురు: మగటపల్లి గ్రామానికి చెందిన కలిగితి దుర్గాప్రసాద్‌పై దాడికి సంబంధించి ఆరుగురిపై కేసు నమోదు చేశామని నగరం ఎస్సై ఎ.చైతన్యకుమార్ మంగళవారం తెలిపారు. ప్రేమించి పెళ్లి చేసుకున్న దుర్గాప్రసాద్ తన కుమార్తె పుట్టినరోజు వేడుకలకు సంబంధించిన కార్డులో తన మామ, అత్త పేరు ప్రచురించడాన్ని సహించలేక ఆరుగుల వ్యక్తులు ఇనుపఊచలు, సరుగుడు కర్రలతో తనపై దాడి చేశారని దుర్గాప్రసాద్ ఫిర్యాదు చేశారన్నారు. దీనిపై కేసు నమోదు చేశామని తెలిపారు. మరో సంఘటనకు సంబంధించి సరెళ్ల సాయితేజ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కలిగితి దుర్గాప్రసాద్‌తో సహా నలుగురు వ్యక్తులు తన ఇంటికి వచ్చి రెచ్చగొట్టే విధంగా మాట్లాడి తనపై దాడి చేశారని ఇచ్చిన ఫిర్యాదుపై కూడా కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

రెండు గ్రామాల్లో పొలం పిలుస్తోంది



మోరి పంచాయతీలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమం

సఖినేటిపల్లి: మోరి, కేశవదాసుపాలెం గ్రామాల్లో మంగళవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్‌లు పసలపూడి లక్ష్మీ పద్మ మంగతాయారు, మేడిద సరోజ అధ్యక్షతన రైతులతో సమావేశాలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందే విధానాల గురించి ఏవో పీవీ నరసింహారావు రైతులకు తెలిపారు. వెటర్నరీ, వ్యవసాయ, ఉద్యాన శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రావులపాలెం సినిమాలు



పద్మశ్రీ: విశ్వం
అక్షర స్క్రీన్–1: వేట్టయాన్
అక్షర స్క్రీన్–2: ఉదయం: మిస్టర్ పర్‌ఫెక్ట్
మధ్యాహ్నం: జనక అయితే గనక
శ్రీవేంకటేశ్వర: దేవర